క్లుప్తంగా

వైభవంగా శ్రీ కోటకొండ గంగమ్మ జాతర

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లె, కొత్త కురవపల్లె వద్ద వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి జాతర వైభవంగా నిర్వహించారు. రెండు గ్రామాల మహిళలు భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలతో అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం



యోగా శిక్షణ శిబిరంలో విద్యార్థుల ప్రదర్శనలు

పీలేరు : స్థానిక షీసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి యోగా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా షీసంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ మాట్లాడుతూ షీ దివ్య యోగ విద్యాలయంలో గత 20 రోజులుగా వేసవి యోగ శిక్షణ శిబిరంతో విద్యార్థులకు పలు రకాల ఆసనాలకు సంబంధించి అలవాట్లను, అనేక సంస్కృత శ్లోకాలను, వాటి భావాలను తెలియజేసినట్లు తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి శిక్షణ పొందిన విద్యార్థులు జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వారు యోగా ప్రదర్శన ఇస్తారని తెలిపారు. యోగా, ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని చెప్పారు.

ఘనంగా అంకాలమ్మ తిరునాల

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు అమ్మవారికి చాందినీబండ్లు ఆలయ ప్రదక్షిణ నిర్వహించి మొక్కులు చెల్లించారు. అలాగే పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. రెండు రోజులపాటు అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

– వాల్మీకిపురం సీఐ పులిశేఖర్



వాల్మీకిపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ నాల్గొవ తేదీ కౌంటింగ్ వరకు ప్రజలంతా సహకరించాలని, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు జరిగే రోజు ప్రజలంతా గుంపులు గుంపులుగా గుమ్మికూడరాదన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. కౌంటింగ్ తర్వాత రోజులల్లో కూడా ర్యాలీలు, బాణాసంచా పేలుళ్ల నిషేదమన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చాందినీ బండ్లు



కలకడ : మండలంలోని దొడ్డిపల్లెమ్మ తల్లికి, గుట్టపల్లె శ్రీ ఆంజనేయ స్వామికి భక్తులు చాందినీ బండ్లు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శనవారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహించిన ఉత్సవాలలో అనేక గ్రామాలకు చెందిన భక్తులు చాందినీ బండ్లు కట్టి ఊరేగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షణల అనంతరం మొక్కులు చెల్లించారు. ఆదివారం ఇంటివద్ద విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

రిటైర్డు ఎంఈఓ మృతి



ఈశ్వరయ్య

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండలం రిటైర్డు ఎంఈఓ ఈశ్వరయ్య (67) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన గతంలో కన్నెమడుగు, రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంగా పని చేశారు. పదోన్నతిపై మండల విద్యాశాఖ అధికారిగా పని చేసి మండలంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయన భార్య ఉషారాణి కన్నెమడుగు గ్రామ పంచాయతీ గతంలో సర్పంచుగా పని చేశారు. మండలంలో ఇటు రాజకీయపరంగా, అటు ఉద్యోగపరంగా పలువురి మన్ననలు పొంది గుర్తింపు పొందారు. ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

గంగమ్మా .. దీవించమ్మా



విశేష అలంకరణలో నల్లవీర గంగాభవాని



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం పట్టణంలోని కోనేటివీధి, నాయక్‌వీధిలోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు దీలు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక వెంగమాంబ ఆర్చీ వద్ద ఉన్న శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయంలో మహిళలు దీలుబోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మెన్ మొగ్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, మహేష్, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉంజల్‌సేవ

–శయన మహావిష్ణువుగా శ్రీవారు



ఊంజల్ సేవలో స్వామి, అమ్మవార్లు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఉంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊయలపై ఉంచి అర్చకులు గోవర్దన్, అమర, బాలాజీ గోవిందనామాలతో ఊయలను ఊపుతూ పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అర్చకులు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చనాది కార్యక్రమాలు జరిపి హారతులిచ్చారు. అభిషేకం, హోమం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి శేష పాన్పుపై పవళించిన శ్రీ మహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవి సేవలు చేస్తున్నట్లు ఉన్న శయన మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు దర్శనమిచ్చారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, ప్రసాద్‌రెడ్డి, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



యూత్ కరాటే క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం

మదనపల్లె : మదనపల్లె యూత్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం, రక్త వర్గీకరణ కార్యక్రమం విజయవంతమైందని క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్.ఏ.ఆర్.సురేష్ అన్నారు. ఆదివారం యూత్ కరాటే క్లబ్ కార్యాలయంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు.శిబిరానికి పలువురు స్వచ్ఛందంగా వచ్చి రక్త వితరణ చేశారు. కరాటే విద్యార్థులకు రక్తవర్గీకరణ పరీక్షలు నిర్వహించి, సరిఫికేట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయభారతి కరస్పాండెంట్ డాక్టర్.ఎన్.సేతు మాట్లాడుతూ.. విద్యార్థులకు కరాటేలో ఉత్తమశిక్షణ ఇవ్వడంతో పాటు సమాజసేవలో భాగంగా తనవంతు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏ.ఆర్.సురేష్ అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రక్తదాన కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్.బి.భార్గవ్, డాక్టర్.లీలావతి, యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి మణిసాయి, హెడ్‌కానిస్టేబుల్ శివ, ఐటీయూసీ కృష్ణమూర్తి, వికలాంగుల సంఘ అధ్యక్షులు మౌలాలి, కరటేరమణ, టి.మహేశ్వర, షేక్‌మిస్బా, అనిత్‌కృష్ణ, నితిన్‌సాయి, సంజన, ఐమాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు రెండు బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండను సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

మదనపల్లె సిటీ: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జూలై 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లును ఏఐ కోఆర్డినేటర్ల వద్ద తీసుకోవచ్చునన్నారు. దీంతోపాటు విద్యార్థులు ఏపీఓపెన్‌స్కూల్.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముందన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గర్నిమిట్ట యల్లమ్మకు ప్రత్యేక పూజలు



యల్లమ్మతల్లికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన గ్రామ దేవత శ్రీ యల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. యల్లమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణ గావించి పుష్పపల్లకిలో ఉంచి గ్రామంలో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. అనంతరం మండలంలోని చింతమాకులపల్లెకు చెందిన నాయునివారు మొదట అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాయునివారు తొలి బోణం సమర్పించిన అనంతరమే మిగిలిన వారందరూ బోణాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం గర్నిమిట్ట తోపాటు కేవీపల్లె, చింతమాకులపల్లె పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున బోణాలు ఊరేగింపుగా తీసువచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా పుష్పయాగ మహోత్సవం



పుష్పయాగ మహోత్సవంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

పీలేరు : వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జయంత్సుత్సవాల్లో భాగంగా పీలేరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పుష్పయాగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో వాసవిక్లబ్, వాసవిక్లబ్ గ్రేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో పుష్పయాగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అన్నదాతల ఇక్కట్లు

పెద్దతిప్పసముద్రం: విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అన్నదాతలు వాపోతున్నారు. ప్రధానంగా మండలంలోని సంపతికోట పంచాయతీలోని పలువురు రైతులు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి టమాటా పంటలపై పెట్టుబడిగా ధారపోశామని, త్రీ ఫేస్ విద్యుత్ అస్తవ్యస్థంగా సరఫరా కావడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్రీ ఫేస్ విద్యుత్ వచ్చినా కొద్ది సేపటికే ఫీజులు కాలిపోతున్నాయని, తద్వారా సాగు చేసిన పంటలకు నీళ్ల లేక టమాటా మొక్కలన్నీ ఎండిపోతున్నాయని వాపోయారు. త్రీ ఫేస్ విద్యుత్‌పై డిస్కం అధికారులను ప్రశ్నిస్తే అధిక లోడ్ కారణంగా ఫీజులు ఎగిరిపోతున్నాయని సమాధానం చెప్పడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా పలు చోట్ల చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రైతుల అవసరాలను గుర్తించి సక్రమంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చొరవ చూపి పంటలను కాపాడాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను ఎత్తులో ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామదేవతకు బోనాలు



శిలెమాతమ్మకు బోనాలు, దీవిటీలు సమర్పిస్తున్న మహిళలు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో బోనాల పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామదేవత పాలేరమ్మతల్లి తిరునాల ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం స్థానికబజారు వీధిలో ఉన్న అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారి సేవకులు ఆనవాయితీ ప్రకారం మొదటి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలు చలివిడి ముద్దలు, బోనాలు, దీవిటీలను మేళతాళతో కోటలోని శిలేమాతమ్మకు, పోలేరమ్మతల్లికి సమర్పించారు. పలువురు భక్తులు చీరె సారెలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

హార్సిలీహిల్స్‌కు బుల్లెట్ రైడింగ్



బుల్లెట్లపై హార్సిలీహిల్స్ వెళ్తున్న రైడర్లు

బి.కొత్తకోట: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు బుల్లెట్‌లపై వచ్చిన పర్యాటక బృందం ఆదివారం సందడి చేసింది. బెంగళూరు ఇందిరానగర్ నుంచి 20 మంది యువకులు ఒకే కంపెనీకి ఒకే రకమైన 20 బుల్లెట్లపై ఒకదాని వెంట ఒకటిగా వరుసగా బయలుదేరి తాడిగోళ్లక్రాస్ మీదుగా హార్సిలీహిల్స్ వెళ్లారు. కొండపై చక్కర్లు కొట్టిన బైక్ రైడర్ల సందడిని పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. తర్వాత మధ్యాహ్నం హార్సిలీహిల్స్ నుంచి వెనుదిరిగి బెంగళూరు వెళ్లారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లి అయిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్దలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రెడ్డి జనసంఘ కమిటీల ఏర్పాటు



కనుగొండ మద్దిరెడ్డి స్వగృహంలో సమావేశమైన రాష్ట్ర రెడ్డిజనసంఘ అధ్యక్ష, కార్యదర్శులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాల్లో రెడ్డి జనసంఘ కమిటీలను ఏర్పాటుచేయనున్నట్లు అధ్యక్షులు లెక్కలకొండారెడ్డి, కోశాధికారి ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మదనపల్లెకు వచ్చిన వారు అఖిలభారత రెడ్డిసంఘాల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షులు కనుగొండ మద్దిరెడ్డితో భేటీ అయ్యారు. స్థానిక అయ్యప్పనగర్‌లోని కనుగొండ మద్దిరెడ్డి స్వగృహంలో జరిపిన చర్చల్లో....రెడ్డిజనసంఘం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యలో మంచి ప్రతిభ కనపరచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. దీనికి కనుగొండ మద్దిరెడ్డి తమవంతు సహాయసహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు సుబ్బారెడ్డి, రోజాహోటల్ కంభం నాగభూషణరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, రెడ్డినాడు కో ఆర్డినేటర్ పేరంరామ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాష మీద సాధికారతకు పద్యపఠనం అవసరం



అనునాదాలు గ్రంథావిష్కరణ చేస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: భాష మీద సాధికారతకు పద్యపఠనం ఎంతో అవసరమని ప్రఖ్యాత రచయిత కోనేటి సుజ్ఞానంద వెంకట నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ప్రఖ్యాత పద్యకవి, కథ నవలా రచయిత ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డి రచించిన «అనునాదాలు» ను విశ్రాంత బ్యాంకు మేనేజర్ వై.శ్రీనివాసులురెడ్డి గ్రంథావిష్కరణ చేసి గ్రంథకర్త ఔన్నత్యాన్ని కొనియాడారు. ప్రముఖ నవలా రచయిత టి.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ పద్యం మీద పట్టు సాధించాలంటే పూర్వజన్మ సుకృతం కొద్దో గొప్పో ఉండి తీరాలని తెలిపారు. ఒకప్పుడు పద్య రచయితలు ఎక్కువగానూ, వచన రచయితలు ఎక్కువగాను ఉండేవారన్నారు. వచన రచయితలు ప్రస్తుతం లెక్కకు మించిపోయి పద్య రచయితలు తక్కువగా కనిపిస్తుండటానికి అదే కారణమన్నారు. యువత పద్య రచనల మీద దృష్టి సారించాలన్నారు. ప్రసిద్ధ హిందీ, సంస్కృత, ఆంగ్ల కవుల పద్యాలను తెలుగులోకి అనువదించి 300 పుటల గ్రంథాన్ని అనువదించిన ప్రభాకర్‌రెడ్డి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా చైతన్యస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు,కామకోటి ప్రసాదరావు, ప్రఖ్యాత నేత్ర వైద్యులు డాక్టర్ సిద్దారెడ్డి, సుమతిరెడ్డి, జహంగీర్‌బాషా, రచయితలు అంజలి, మోహన్‌గుప్తా, కవితశ్రీ, నాగభూషణరావు పాల్గొన్నారు.

కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వాలు చొరవ చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ టీవీ.రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ మదనపల్లె నియోజకవర్గ, పట్టణస్థాయి, బాధ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ...కార్మికవర్గ సమస్యలు పరిష్కారం చేయడంలో ఇచ్చిన హామీలు అమలుజరపడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు హరించుకుపోతున్నాయన్నారు. ప్రజాప్రతినిధుల వేతనాలు అమాంతంగా పెంచుతున్న ప్రభుత్వాలు, అనునిత్యం దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలుచేయకుండా శ్రమదోపిడీకి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయన్నారు. అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన తక్షణమే అమలుచేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్ తదితర చిరుస్థాయి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనం, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు రెడ్డెప్ప, ముబారక్, తిరుమల, రవి, మురళి పాల్గొన్నారు.

మైదానాలు క్రీడాకారులతో కిటకిట



మదనపల్లె సిటీ: వేసవి సెలవులు రావడంతో మైదానాల్లో క్రీడాకారులతో కిటకిటలాడుతున్నాయి. బీటీ కాలేజీ మైదానంలో హాకీ, వాలీబాల్, క్రికెట్, మిషన్ కాంపౌండ్‌లో పుట్‌బాల్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాకీ,క్రికెట్ క్రీడలను ఆడారు. కోచ్‌లు విద్యార్థులను ఆయా క్రీడల్లో ఆటలాడించారు. ఉదయం, సాయంత్రం క్రీడాకారులతో సందడి నెలకొంది.